నీటి సంరక్షణ ప్రజా ఉద్యమంగా మారాలి

విశ్వంభర, తెలంగాణ బ్యూరో : నీటి సంరక్షణ ప్రభుత్వ బాధ్యత మాత్రమే కాదని, ప్రతి పౌరుడు సామాజిక బాధ్యతగా స్వీకరించాలని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి, హైదరాబాద్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ పిలుపునిచ్చారు. పెరుగుతున్న హైదరాబాద్ నగర జనాభా, తగ్గుతున్న భూగర్భ జలాలు, రాబోయే ఎల్‌నినో పరిస్థితుల నేపథ్యంలో నీటి పొదుపును ప్రజా ఉద్యమంగా మార్చాల్సిన అవసరం ఉందన్నారు. గురువారం ఖైరతాబాద్‌లోని జలమండలి ప్రధాన కార్యాలయంలో నీటి దుర్వినియోగాన్ని అరికట్టేందుకు రూపొందించిన 'PAANI' (పానీ) మొబైల్ యాప్‌ను మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా నీటి సంరక్షణ, వర్షపు నీటి నిల్వ, భూగర్భ జలాల పరిరక్షణ, నీటి పునర్వినియోగం, భవిష్యత్తు తాగునీటి అవసరాలపై మాట్లాడారు.

జరిమానాల కంటే ప్రజల్లో మార్పే ముఖ్యం..

తాగునీటి దుర్వినియోగాన్ని అరికట్టేందుకు కేవలం అధికారుల పర్యవేక్షణ సరిపోదని, ప్రజల భాగస్వామ్యం అత్యంత అవసరమని మంత్రి పేర్కొన్నారు. నగరంలోని ప్రతి ప్రాంతంలో జరుగుతున్న నీటి వృథాను గుర్తించేందుకు ప్రజల సహకారం తీసుకోవాలనే ఉద్దేశంతో పానీ యాప్‌ను అందుబాటులోకి తీసుకొచ్చినట్లు తెలిపారు. నీటి దుర్వినియోగానికి పాల్పడేవారిపై జరిమానాలు విధించడం ప్రభుత్వ ప్రధాన ఉద్దేశం కాదని, అలాంటి చర్యలు పునరావృతం కాకుండా ప్రజల్లో అవగాహన, బాధ్యత పెంచడమే లక్ష్యమని స్పష్టం చేశారు. ముందుగా అవగాహన కల్పిస్తామని, అయినప్పటికీ నిబంధనలు ఉల్లంఘిస్తే జరిమానాలతో పాటు అవసరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

ప్రతి పౌరుడు వాటర్ వాలంటీర్‌గా మారాలి..

సమాజ హితం కోరుకునే ప్రతి ఒక్కరూ వాటర్ వాలంటీర్‌గా నమోదు చేసుకోవాలని మంత్రి పిలుపునిచ్చారు. పాత్రికేయులు, ఆర్టీఐ కార్యకర్తలు, ప్రభుత్వ ఉద్యోగులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, కాలనీ సంక్షేమ సంఘాల సభ్యులు, యువతతో పాటు ఆసక్తి ఉన్న పౌరులందరూ ఈ కార్యక్రమంలో భాగస్వాములు కావచ్చన్నారు. తమ పరిసరాల్లో తాగునీటి వృథా, దుర్వినియోగం జరుగుతున్నట్లు గుర్తిస్తే పానీ యాప్ ద్వారా జలమండలి అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. అందిన సమాచారంపై అధికారులు పరిశీలించి తగిన చర్యలు చేపడతారని తెలిపారు. నీటి సంరక్షణలో చురుగ్గా పాల్గొనే వాలంటీర్ల సేవలను గుర్తించి ప్రోత్సహిస్తామన్నారు.

భారీ వర్షా లు కురిసినా పెరగని భూగర్భ జలాలు..

హైదరాబాద్‌లో భారీ వర్షాలు కురుస్తున్నప్పటికీ భూగర్భ జలాలు ఆశించిన స్థాయిలో పెరగకపోవడం ఆందోళనకరమని మంత్రి పేర్కొన్నారు. వర్షాల సమయంలో రహదారులు జలమయమవుతున్నా, ఆ నీటిని భూమిలోకి ఇంకించే వ్యవస్థలు తగినంతగా లేకపోవడం వల్ల విలువైన జలవనరులు వృథా అవుతున్నాయని తెలిపారు. గతంలో గ్రామాల్లో చెరువులు, బావులు, సహజ నీటి నిల్వ వ్యవస్థల ద్వారా భూగర్భ జలాలు సంరక్షించబడేవని గుర్తుచేశారు. ప్రస్తుతం నగర విస్తరణ, కాంక్రీటు నిర్మాణాలు, బహుళ అంతస్తుల భవనాల పెరుగుదలతో వర్షపు నీరు భూమిలోకి ఇంకే అవకాశాలు తగ్గుతున్నాయని వివరించారు.

ప్రతి భవనంలో వర్షపు నీటి సంరక్షణ తప్పనిసరి..

నగరంలోని నివాస గృహాలు, అపార్ట్‌మెంట్లు, గేటెడ్ కమ్యూనిటీలు, వాణిజ్య సముదాయాల్లో వర్షపు నీటి సంరక్షణ వ్యవస్థలను సమర్థంగా అమలు చేయాల్సిన అవసరం ఉందన్నారు. ప్రభుత్వ నిబంధనలు ఉన్నప్పటికీ పలు ప్రాంతాల్లో రెయిన్ వాటర్ హార్వెస్టింగ్, నీటి రీసైక్లింగ్, మురుగునీటి శుద్ధి వ్యవస్థలు సక్రమంగా అమలు కావడం లేదని పేర్కొన్నారు. ఈ పరిస్థితిని మార్చేందుకు మున్సిపల్ సంస్థలు, జలమండలి, సంబంధిత ప్రభుత్వ విభాగాల సమన్వయంతో చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. ముఖ్యంగా గేటెడ్ కమ్యూనిటీలు నీటి పునర్వినియోగాన్ని పెంచుకోవాలని, అవసరమైన చోట ఎస్టీపీలను ఏర్పాటు చేసి శుద్ధి చేసిన నీటిని తాగేతర అవసరాలకు వినియోగించాలని సూచించారు.

హైదరాబాద్ భవిష్యత్తుకు గోదావరి జలాలు..

వేగంగా విస్తరిస్తున్న హైదరాబాద్ నగరానికి భవిష్యత్తులో తాగునీటి అవసరాలు మరింత పెరుగుతాయని మంత్రి తెలిపారు. ప్రస్తుతం నగరానికి దూర ప్రాంతాల్లోని కృష్ణా, గోదావరి తదితర జలవనరుల నుంచి నీటిని తరలించాల్సి వస్తోందని, ఇందుకోసం భారీ మౌలిక సదుపాయాలు అవసరమవుతున్నాయని వివరించారు. గోదావరి ఫేజ్ 2, 3 ప్రాజెక్టుల ద్వారా నగరానికి అదనపు జలాలను అందించేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతోందన్నారు. గతంలో చేపట్టిన మంజీరా, సింగూరు, కృష్ణా, గోదావరి తాగునీటి పథకాలను ప్రస్తావిస్తూ, పెరుగుతున్న నగర అవసరాలకు అనుగుణంగా దీర్ఘకాలిక ప్రణాళికలు అవసరమని పేర్కొన్నారు. కొత్త నీటి వనరులను సమకూర్చుకోవడంతో పాటు ప్రస్తుతం అందుబాటులో ఉన్న నీటిని సమర్థంగా వినియోగించుకోవడం కూడా అంతే ముఖ్యమని స్పష్టం చేశారు.

ఎల్‌నినో నేపథ్యంలో ముందస్తు జాగ్రత్తలు..

రాబోయే ఎల్‌నినో పరిస్థితుల నేపథ్యంలో తాగునీటి లభ్యతపై సవాళ్లు ఎదురయ్యే అవకాశం ఉందని మంత్రి పేర్కొన్నారు. ఇప్పటికే భూగర్భ జలాల తగ్గుదల, ట్యాంకర్లకు పెరుగుతున్న డిమాండ్ వంటి అంశాలను ప్రభుత్వం పరిగణనలోకి తీసుకుని ముందస్తు చర్యలు చేపడుతోందన్నారు. నీటి వనరులను పెంచుకోవడం, సరఫరా వ్యవస్థను బలోపేతం చేయడం, నీటి వృథాను తగ్గించడం, ప్రజల్లో అవగాహన పెంచడం వంటి చర్యలను సమాంతరంగా అమలు చేయాల్సిన అవసరం ఉందన్నారు.

ప్రతి నీటి బొట్టును కాపాడుకోవాలి..

నీటి సంరక్షణను ప్రతి కుటుంబం తమ దైనందిన జీవితంలో భాగం చేసుకోవాలని మంత్రి కోరారు. తాగునీటిని వాహనాలు కడగడం, ఫ్లోర్లు శుభ్రం చేయడం వంటి అవసరాలకు వృథా చేయవద్దని సూచించారు. ఇళ్లు, హోటళ్లు, ఆసుపత్రులు, లాడ్జీలు, వాణిజ్య సంస్థలు తమ నీటి వినియోగ విధానాలను సమీక్షించుకుని పొదుపు చర్యలు చేపట్టాలన్నారు. ప్రతి ఒక్కరూ ముందుగా తమ ఇంట్లో నీటి వృథాను అరికట్టాలని, ఆ తర్వాత తమ పరిసరాల్లో జరిగే దుర్వినియోగాన్ని అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. నీటిని పొదుపు చేయడం మన బాధ్యత. నీటి దుర్వినియోగాన్ని అరికట్టడం మన సామాజిక కర్తవ్యం. ప్రతి పౌరుడు వాటర్ వాలంటీర్‌గా మారి భవిష్యత్ తరాలకు నీటి భద్రత కల్పించడంలో భాగస్వామి కావాలని మంత్రి పొన్నం ప్రభాకర్ సూచించారు.

తెలంగాణ, ఏపీలో 'సర్' గడువు పొడిగింపు

విశ్వంభర, తెలంగాణ బ్యూరో : ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియకు సంబంధించి సవరించిన నూతన షెడ్యూల్‌ను భారత ఎన్నికల సంఘం విడుదల చేసింది. ఓటర్ల నమోదు, వివరాల సవరణ, ఎన్యుమరేషన్ ఫారాల సేకరణను సమర్థవంతంగా పూర్తి చేయాలనే లక్ష్యంతో ఈ గడువును ఈసీఐ పొడిగించింది. ఏపీలో నవంబర్ 20 వరకు, తెలంగాణలోనూ నవంబర్ 26 వరకు గడువు పొడిగించింది. నవంబర్ 30న ఓటర్ల తుది జాబితా ప్రచురించనుంది. ఆయా రాష్ట్రాల ప్రధాన ఎన్నికల అధికారుల విజ్ఞప్తులు, రాజకీయ పార్టీల అభ్యర్థనలను పరిశీలించిన కేంద్ర ఎన్నికల సంఘం ఈ మేరకు అధికారికంగా కీలక ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నూతన షెడ్యూల్ ప్రకారం ప్రజలకు, కొత్త ఓటర్లకు దరఖాస్తులు సమర్పించడానికి అదనపు సమయం లభించింది. క్లెయిమ్‌లు, అభ్యంతరాల స్వీకరణ ప్రక్రియకు ఈసీ ఈ పొడిగించిన గడువును కల్పించింది. గ్రామాల్లో, పట్టణాల్లో బూత్ స్థాయి అధికారులు ఇంటింటికీ తిరిగి మిగిలిపోయిన అర్హులైన పౌరుల వివరాలను నమోదు చేయడంతో పాటు, సీనియర్ సిటిజన్లు, దివ్యాంగులకు అవసరమైన సహాయం అందిస్తారని అధికారులు వెల్లడించారు. పొడిగించిన గడువుల ప్రకారం స్వీకరించిన క్లెయిమ్‌లు, అభ్యంతరాలను క్షేత్రస్థాయిలో పూర్తిస్థాయి పరిశీలన జరిపి పరిష్కరించనున్నారు. అర్హత కలిగిన ఓటర్లందరూ ఈ పొడిగించిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని తమ పేర్లను సరిచూసుకోవాలని ఎన్నికల సంఘం విజ్ఞప్తి చేసింది.

కర్మన్ ఘాట్లో రైస్ ట్రేడర్లపై తనిఖీలు

- 12 బృందాలతో 20 దుకాణాల్లో సోదాలు
- బియ్యం బస్తాలపై అధికారుల పరిశీలన

విశ్వంభర, ఎల్బీనగర్ : కర్మన్ ఘాట్ పరిధిలోని పలు రైస్‌మిల్‌పై సివిల్ సప్లైస్, విజిలెన్స్, లీగల్ మెట్రాలజీ అధికారులు గురువారం సంయుక్తంగా తనిఖీలు చేపట్టారు. 12 బృందాలుగాఏర్పడి పలు సోదాలు నిర్వహించారు. బియ్యం ధరలు పెరుగుతున్న నేపథ్యంలో వ్యాపారులు కృత్రిమ కొరత సృష్టించేందుకు రేషన్ బియ్యాన్నిపాలిష్ చేసి సన్న బియ్యంగా మారుస్తున్నారనే ఆరోపణలపై ఈ తనిఖీలు చేపట్టినట్లు అధికారులు తెలిపారు. సివిల్ సప్లైస్ విజిలెన్స్ ఎస్పీ రామకుమార్, తూనికలు, కొలతల ఏసీపీ శివానంద్, సివిల్ సప్లైస్ ఓఎస్టీ శ్రీధర్ రాజు, హైదరాబాద్, రంగారెడ్డి డీఎస్ఓలు శ్రీనివాస్, వనజాత తమ సిబ్బందితో కలిసిఈ తనిఖీలు నిర్వహించారు.ట్రేడర్లపై సోదాలు చేయగా, 26 కిలోల బియ్యం బస్తాల్లో 24, 25కిలోలే ఉన్నట్లు గుర్తించామని కర్మన్ ఘాట్ లో 20 మంది రైస్
అధికారులు తెలిపారు. బస్తాలో 25 కిలోల బియ్యం ఉంటే 5 చెల్లించాల్సి వస్తుందని, జీఎస్టీ ఎగవేసేందుకే బస్తాపై 26కిలోలు అని ముద్రించి వినియోగదారులను, ప్రభుత్వాన్నిమోసం చేస్తున్నట్లు గుర్తించామని చెప్పారు. పలు రైస్‌పుల్లో కొనుగోలు రశీదులు, నిల్వ చేసిన స్టాక్‌లో తేడాలు ఉన్నట్లు గుర్తించామని అధికారులు తెలిపారు. కొన్నిదుకా ణాల్లో రేషన్ బియ్యం ఉన్నట్లు అనుమానించి నమూనాలు సేకరించి ల్యాబొరేటరీకి తరలించామన్నారు. కొన్నిదుకాణాలు ట్రేడ్ లైసెన్స్ లేకుండానే నిర్వహిస్తున్నట్లు తమదృష్టికి వచ్చిందని, వాటిపై చర్యలుతీసుకుంటామని తెలిపారు.రిజిస్టర్డ్ బ్రాండ్లకు బదులుగా సొంత లోగో ముద్రించి విక్రయాలు చేస్తున్నట్లు గుర్తించామని, వీటిని పూర్తిస్థాయిలో పరిశీలించి చర్యలు తీసుకుంటామని చెప్పారు.

వేగంగా కొనసాగుతున్న అభివృద్ధి పనులు

విశ్వంభర, భద్రాచలం: ప్రస్తుతం భద్రాచల దేవస్థాన అభివృద్ధి పనులు వేగంగా కొనసాగుతున్నాయని, ఇదే స్పీడుతో ముందుకెళితే గోదావరి పుష్కరాలకు పది రోజుల ముందే భద్రాద్రి దేవస్థానం సిద్ధమవుతుందని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ధీమా వ్యక్తం చేశారు. గురువారం ఆయన భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్ర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు, పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు, అశ్వారావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణ, కలెక్టర్ అంకిత్, ఎస్పీ రోహిత్ రాజ్, ఐటీడీఏ పీవో రాహుల్, సబ్ కలెక్టర్ మృణాల్ శ్రేష్ఠ్ లతో కలిసి దమ్మక్క అన్నదాన సత్రం నుంచి మెట్ల దారి వరకు.. దేవస్థానం చుట్టూ కలియతిరిగి నేరుగా పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా.. విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. బాసర నుంచి భద్రాద్రి వరకు టెంపుల్ రూట్ కావాలనే లక్ష్యంతో..భద్రాచల దేవస్థానాన్ని మహోద్భుతంగా అభివృద్ధి చేయాలనే ఉద్దేశంతో గత శ్రీరామ నవమి రోజున రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శ్రీకారం చుట్టారని గుర్తు చేశారు. ఇప్పటికే తాను మూడుసార్లు ఆలయాన్ని సందర్శించి అభివృద్ధి పనులను పరిశీలించానని, ప్రస్తుతం వేగంగా కొనసాగుతూ స్లాబులు పూర్తయ్యాయని, నవంబర్ మొదటివారం తర్వాత రాతి నిర్మాణ పనులు చేపడతామని అన్నారు.



భద్రాచలం పట్టణంలో

వరద ముప్పు లేకుండా చూస్తాం..

ఆలయ అభివృద్ధి పనులకు సంబంధించి ప్రతివారం జిల్లా కలెక్టర్, సబ్ కలెక్టర్, ఆర్ అండ్ బి, దేవాదాయ శాఖ అధికారులు సమీక్ష నిర్వహిస్తూ మంచి పురోగతి సాధిస్తున్నారని అధికారులను మంత్రి అభినందించారు. వర్షాకాలంలో.. గోదావరి ఉధృతి సమయంలో భద్రాచలం పట్టణంలోని లోతట్టు ప్రాంతాల్లో వరద ముంపు లేకుండా చూడాలని భద్రాచలం ఎమ్మెల్యే విజ్ఞప్తి చేశారని.. దీంతో యుద్ధప్రాతిపదికన ప్రణాళికలు సిద్ధం చేయాల్సిందిగా సంబంధిత అధికారులను ఆదేశించినట్లు మంత్రి తెలిపారు. అలాగే.. ఈసారి గోదావరి పుష్కరాలకు లక్షల్లో భక్తులు వచ్చే అవకాశం ఉందని, ఇందుకు తగ్గట్టుగా ఘాట్లను సిద్ధం చేస్తామని, భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా రాష్ట్ర ప్రభుత్వం పూర్తి చర్యలు చేపడుతుందని వివరించారు.ఈ కార్యక్రమంలో..: డిసిసి అధ్యక్షురాలు దేవీ ప్రసన్న, కాంగ్రెస్ సీనియర్ నాయకులు గోపాలరావు, పలువురు ప్రజా ప్రతినిధులు, అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

కాచం బిక్షమయ్యకు ఘన నివాళులు

నివాళులర్పించిన ప్రజా విశ్వంభర పాత్రికేయులు

విశ్వంభర, రామన్నపేట: నల్లగొండ జిల్లా, నార్కట్ పల్లి మండలం, అమ్మనబోలు గ్రామానికి చెందిన తెలంగాణ ఉద్యమకారుడు కాచం సత్యనారాయణ తండ్రి కాచం బిక్షమయ్య బుధవారం రోజు గుండెపోటుతో మరణించగా, గురువారం రోజు విశ్వంభర దినపత్రిక యాదాద్రి భువనగిరి రిపోర్టర్లు దేవిరెడ్డి సత్తిరెడ్డి, కనకచారి, మహబూబాబాద్ జిల్లా రిపోర్టర్లు ఎర్రోజు అశోక్, పల్లె దేవేందర్, పంజాల వాసుదేవ్ గౌడ్ తదితరులు అమ్మనబోలు గ్రామంలోని వారి స్వగృహానికి వెళ్ళి కాచం బిక్షమయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.అనంతరం వారి కుమారుడు, తెలంగాణ ఉద్యమకారుడు కాచం సత్యనారాయణను, వారి కుటుంబ సభ్యులను పరామర్శించి తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేయడం జరిగింది.ఈకార్యక్రమంలో విశ్వంభర దినపత్రిక (వీ3 న్యూస్) డైరెక్టర్ సాయికుమార్ కాచం ఉన్నారు.





కాచం బిక్షమయ్య చిత్రపటానికి నివాళులర్పించిన అడ్వకేట్ కుమారస్వామి.

ఆహారంతోనే ఆరోగ్య పరిరక్షణ

విశ్వంభర, హైదరాబాద్ : ఆరోగ్యకరమైన ఆహారం, సహజ జీవన విధానంతోనే సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమని హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ అన్నారు. లక్ష్మణ్ పూడి స్థాపించిన లక్ష్మణ్ ఆరోగ్యగ్రామం ప్రథమ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రంగనాథ్ మాట్లాడుతూ.. నేటి సమాజంలో ఆహార కల్తీ ఆందోళన కలిగిస్తోందన్నారు. పలు హోటళ్లు, రెస్టారెంట్లు ఆహార భద్రత ప్రమాణాలను పాటించకపోవడం ప్రజారోగ్యానికి ముప్పుగా మారిందన్నారు. భావితరాలకు ఆస్తిపాస్తుల కంటే స్వచ్ఛమైన నీరు, కల్తీలేని ఆహారం అందించడం ముఖ్యమన్నారు. ముఖ్యంగా యువత పోషకాహారం, పర్యావరణ పరిరక్షణ, స్వచ్ఛమైన తాగునీటి వినియోగంపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. లక్ష్మణ్ ఆరోగ్యగ్రామం వ్యవస్థాపకుడు లక్ష్మణ్ పూడి మాట్లాడుతూ.. పోషకాహారం, ప్రకృతి వ్యవసాయం, ఆరోగ్యకరమైన జీవనశైలిపై ప్రజలకు అవగాహన కల్పించడమే తమ లక్ష్యమన్నారు. వ్యాధుల నివారణకు అవసరమైన ఆహారపు అలవాట్లను ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య, ప్రజాగాయని అరుణోదయ విమలక్క, సుమన్ టీవీ వ్యవస్థాపకుడు సుమన్ దూది, సినీ నటులు సప్తగిరి, కిరాక్ ఆర్పీ, ఫైట్ మాస్టర్లు రామ్-లక్ష్మణ్, సంగీత దర్శకుడు వందేమాతరం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



ఉత్తమ రైతులకు 'కిసాన్ మహారాజ్' అవార్డులు

సుమారు 50 మంది ఆదర్శ రైతులకు ఘన సత్కారం

విశ్వంభర, హైదరాబాద్ : వ్యవసాయ రంగంలో వినూత్న పద్ధతులను అనుసరిస్తూ ఆదర్శంగా నిలుస్తున్న రైతులను ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని పలువురు ప్రముఖులు పేర్కొన్నారు.మాదాపూర్‌లోని శిల్పకళా వేదికలో మైవిలేజ్ సొల్యూషన్స్ లిమిటెడ్ ఆధ్వర్యంలో వైజ్ టీవీ సహకారంతో 'కిసాన్ మహారాజ్ అవార్డ్స్-2026' కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. వ్యవసాయ రంగ అభివృద్ధికి విశేష కృషి చేస్తున్న సుమారు 50 మంది ఆదర్శ రైతులను ఎంపిక చేసి, ఒక్కొక్కరికి రూ.5 వేల నగదు చెక్కు, షీల్డ్ అందజేసి సత్కరించారు.
ఈ కార్యక్రమానికి మాజీ మంత్రులు హరీశ్‌రావు, సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి, విజయ సాయిరెడ్డి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రరావు, ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి, చేవెళ్ల మాజీ ఎంపీ గడ్డం రంజిత్‌రెడ్డి, బండి రమేశ్ తదితర ప్రముఖులు హాజరయ్యారు. ఈ సందర్భంగా వ్యవసాయంలో ఆధునిక సాంకేతికత, శాస్త్రీయ సాగు పద్ధతుల ప్రాధాన్యాన్ని వివరించారు. డ్రిప్ ఇరిగేషన్, డ్రోన్ల వినియోగం, ప్రకృతి ఆధారిత ఎరువులు, నీటి పొదుపు విధానాలతో సాగు వ్యయాన్ని తగ్గించుకుని అధిక దిగుబడులు సాధించవచ్చని పేర్కొన్నారు. వినూత్న సాగు విధానాలతో విజయాలు సాధిస్తున్న రైతుల కృషిని సమాజానికి పరిచయం చేయడంతో పాటు ఇతర రైతులకు స్ఫూర్తి నివ్వడమే ఈ అవార్డుల ప్రధాన ఉద్దేశమని నిర్వాహకులు తెలిపారు. రైతులను గౌరవించడం ద్వారా వ్యవసాయ రంగంలో నూతన ఆవిష్కరణలను మరింత ప్రోత్సహించవచ్చని పేర్కొన్నారు.



పట్టభద్రుడు ఓటర్ నమోదును చేసుకోవాలి: ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి

విశ్వంభర, ఎల్బీనగర్ : డిగ్రీ పూర్తి చేసిన ప్రతి వ్యక్తి తన ఓటును నమోదు చేసుకోవాలని ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవీ రెడ్డి సుధీర్ రెడ్డి అన్నారు.ఎల్బీనగర్ నియోజకవర్గ శాసనసభ్యులు దేవిరెడ్డి సుధీర్ రెడ్డి కొత్త పేట డివిజన్ పరిధిలోని మోహన్ నగర్ వద్ద జరిగిన పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటరు నమోదు కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా అర్హులైన పట్టభద్రులందరూ ఎమ్మెల్సీ ఓటరుగా తమ పేర్లను నమోదు చేసుకోవాలని,ప్రజాస్వామ్య ప్రక్రియలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఆయన పిలుపునిచ్చారు. పట్టభద్రులు తమ ఓటు హక్కును వినియోగించుకునేలా ఓటరు నమోదు ప్రక్రియపై అవగాహన కల్పించాలని సూచించారు. ఇట్టి కార్యక్రమంలో డివిజన్ భారస పార్టీ అధ్యక్షులు లింగాల రాహుల్ గౌడ్, జహీర్ ఖాన్, పాండుగౌడ్, రూపసింగ్, అనురాధ, పద్మ ,విజయలక్ష్మి, రాజు, లింగేశ్వర్, శశి, భాస్కర్, శీను తదితరులు పాల్గొన్నారు.



అఖిల భారత పద్మ బ్రాహ్మణ వేద పాఠశాల సంఘము అధ్యక్షునిగా ధనుంజయశాస్త్రి

విశ్వంభర, సరూర్ నగర్ : అఖిల భారత పద్మ బ్రాహ్మణ వేద పాఠశాల సంఘము జాతీయ అధ్యక్షులుగా ఎన్నికైన బ్రహ్మశ్రీ డాక్టర్ పాశికంటి ధనుంజయశాస్త్రి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అఖిల భారత పద్మ బ్రాహ్మణ వేద పాఠశాల సంఘానికి నాలుగవసారి ధనుంజయశాస్త్రి ఎన్నిక కావడం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేశారు. వేద పాఠశాల సంఘం అభ్యున్నతి కోసం కృషి చేయడం వల్లే నాలుగవసారి జాతీయ అధ్యక్షునిగా ధనుంజయశాస్త్రి ఎన్నికయ్యారని పలువురు అభినందనలు తెలియజేశారు.



పట్టబద్రులందరూ ఓటరుగా నమోదు చేయించుకోవాలి

ఉపాధ్యక్షుడు మొహమ్మద్ జాహేద్

విశ్వంభర, సరూర్ నగర్ : పట్టభద్రులందరూ ఓటర్ గా నమోదు చేయించుకోవాలని ఆర్కేపురం డివిజన్ బి ఆర్ ఎస్ ఉపాధ్యక్షుడు మొహమ్మద్ జాహేద్ కోరారు. బుధవారం ఆయన నివాసంలో ఏర్పాటు చేసినటుపంటి విలేకరుల సమావేశంలో హైదరాబాద్ రంగారెడ్డి మహబూబ్నగర్ ఓటర్ నమోదు చేసుకోవాలని చెప్పేసి ప్రతి ఒక్కరికి విజ్ఞప్తి చేశారు. 2023 సంవత్సరం వరకు డిగ్రీ పూర్తి చేసిన ప్రతి ఒక్కరు అప్లై చేసుకోవచ్చు అని తెలిపారు.



పట్టభద్రుల ఓటరు నమోదు కార్యక్రమం

విశ్వంభర, ఎల్బీనగర్ : గడ్డి అన్నారం డివిజన్‌లో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటరు నమోదు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలనే లక్ష్యంతో నిరంతరం కృషి చేస్తున్నాం అని గడ్డి అన్నారం డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మద్దెల సునీల్ బాబు అన్నారు. గడ్డి అన్నారం డివిజన్ పరిధిలోని వివిధ అపార్ట్‌మెంట్లు, ఇళ్లకు వెళ్లి డిగ్రీ పూర్తి చేసిన పట్టభద్రులకు అవగాహన కల్పిస్తూ, అర్హులైన ప్రతి ఒక్కరూ ఎమ్మెల్సీ ఓటరుగా నమోదు చేసుకునేలా ఎన్రోల్మెంట్ కార్యక్రమాన్ని కొనసాగించడం జరిగింది. ప్రతి పట్టభద్రుడికి ఓటు హక్కు కల్పించడమే మా లక్ష్యం. ప్రజాస్వామ్య పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి. కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు వైవి కృష్ణారెడ్డి, నాగ మహేష్ తదితరులు పాల్గొన్నారు.



సొంతింటి కలను నెరవేర్చిన ప్రజా ప్రభుత్వం

- గ్రామ శాఖ అధ్యక్షుడు కల్లు శ్రీనివాస్ రెడ్డి

విశ్వంభర, మాడుగుల పల్లి : ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం పేదవాడి సొంత కల అయినా ఇందిరమ్మ ఇల్లు నీ నిర్మించి ఇస్తుందని తెలిపారు.బుధ వారము మాడుగులపల్లి మండలం ఇందుగుల గ్రామంలో పందిరి సతీష్ రాధిక ల ఇందిరమ్మ ఇల్లు నీ ముఖ్యఅతిథిగా గ్రామ శాఖ అధ్యక్షుడు కల్లు శ్రీనివాస్ రెడ్డి హాజరై ప్రారంభించారు .ఈ కార్యక్రమంలో బాల్నే ఇంద్రారెడ్డి, ముసుగోడు యాదగిరి,గుడుపాటి శ్రీనివాసు ,తామరపల్లి నాగరాజు ,జానీ, పందిరి కొండలు, కట్ట శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మియాపూర్‌లో 550 ఎకరాల భూమి ప్రభుత్వానిదే: సుప్రీం కీలక తీర్పు

విశ్వంభర, ఢిల్లీ: రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లి మండలం మియాపూర్ సర్వే నెంబర్ 100, 101లో భూ వివాదంపై సుప్రీంకోర్టులో తెలంగాణ ప్రభుత్వం విజయం సాధించింది. ఈ రెండు సర్వే నెంబర్లలో 550ఎకరాల భూమి తమదేనంటూ కొందరు గతంలో ఆక్రమించే ప్రయత్నం చేశారు. అయితే.. 2003లో హైకోర్టు తీర్పును సవాలు చేస్తూ సుప్రీం కోర్టులోప్రైవేట్ వ్యక్తులు దాఖలు చేసిన అప్పీళ్లను ఇవాళ సుప్రీంకోర్టు కొట్టివేసింది. 550 ఎకరాలకు పైగా విస్తీర్ణంలో ఉన్న ప్రభుత్వ భూమి పరిరక్షణకు చూపిన ప్రత్యేక చొరవను కోర్టు అభినందించింది.

రిపోర్టర్లు కావలెను
V3 NEWS
ప్రజా విశ్వంభర
"విశ్వంభర"
తెలుగు దిన పత్రిక
ప్రముఖ టీవీ ఛానల్, తెలుగు దినపత్రికకు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలో జిల్లాలు, మండలాల వారిగా రిపోర్టర్లు, కెమెరామెన్స్, వీడియో ఎడిటర్స్, న్యూస్ పేపర్ డిజైనర్స్, గ్రాఫిక్ డిజైనర్, సబ్-ఎడిటర్లు, యాంకర్స్, PCR ఆపరేటర్స్, మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్ పని చేయుటకు అనుభవం, ఆసక్తి గలవారు కావలెను.
సంప్రదించవలసిన చిరునామా
ఫ్లాట్ నెం. 204, 2వ అంతస్తు, బాదం కాంప్లెక్స్, మెట్రో పిల్లర్ నెం. 1560 ఎదురుగా, చైతన్యపురి × రోడ్స్, దిల్‌సుఖ్‌నగర్, హైదరాబాద్ – 500 060. తెలంగాణ.
సెల్: 9441222429, 8885402108